తల్లీ.. వెళ్లొస్తాం

ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి జాతర ఉత్సవాలు ముగిశాయి. కప్లై, సిద్దికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల్లోని పవిత్ర నదుల నుంచి గంగాజలాన్ని తీసుకొచ్చి మంగళవారం ఉదయం దేవతల ప్రతిమలను శుద్ధి చేసి ఉత్సవాలకు ముగింపు పలికారు. నెల రోజుల పాటు కొనసాగిన జాతరకు గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణతోపాటు ఆరు రాష్ట్రాల నుంచి 2.12 లక్షల మంది భక్తులు తరలివచ్చారు. జంగుబాయితో పాటు మర్రిచెట్టు, పోచమ్మ, రావుడ్, మైసమ్మను దర్శించుకున్నారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు జంగుబాయిని 320 మేకలు దర్శించుకున్నట్లు కటోదాలు, ఆలయ కమిటీ సభ్యులు శ్యాంరావు, మరప జాబీరావులు తెలిపారు. - కెరమెరి (ఆసిఫాబాద్)


రావుడ్ దేవతలకు పూజలు చేస్తున్న భక్తులు


మైసమ్మకు మొక్కుతూ..


నైవేద్యం తయారు చేస్తూ..


భేటింగ్ అవుతున్న మహిళలు

క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎస్ఈ శేషారావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని తారకరామానగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన 2100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో ఎస్ఈ శేషారావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ సీజన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ జీవరత్నం, ఏడీ ఎండీ ఫిరోజ్‌ఖాన్, ఏఈ లక్ష్మీరాజం, ఫోర్‌మెన్ రమేశ్, లైన్‌ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై కొమురయ్య

పెంచికల్‌పేట్: ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్సై కొమురయ్య అన్నారు. పెంచికల్‌పేట్ –దహెగాం ప్రధాన రహదారిలో మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. ఆర్‌సీ, ఇన్సురెన్సు, డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో వాహనదారులకు రోడ్డుభద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న కోనేరు కోనప్ప

బెజ్జూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన తొర్రెం బానయ్య సోదరుడు తొర్రెం గోసాయి సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుంటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం నేరం


మాట్లాడుతున్న ఆపరేషన్ స్మైల్ ఎస్సై రాజయ్య

దహెగాం: బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరమని ఆపరేషన్ స్మైల్ ఎస్సై రాజయ్య అన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో వారసంత, దుకాణ సముదాయాల్లో తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాల్లో బాలకార్మికులు పని చేస్తున్నట్లు గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బడీడు పిల్లలను బడికి పంపించాలని పనిలో పెట్టుకోవద్దన్నారు. బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో లీగల్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది తిరుపతమ్మ, శంకర్, కొమురయ్య తదితరులు ఉన్నారు.

'మన్నెవార్' భవన నిర్మాణానికి నిధులు మంజూరు


బెజ్జూర్: మండల కేంద్రంలోని మన్నెవర్ కుల సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేసింది. కాగా బెజ్జూర్ మత్స్యకారుల కుల సంఘం భవన పనుల కోసం రూ.5లక్షలు మంజూరయ్యాయి. దీంతో మత్స్యకార కుల సంఘం, మన్నెవర్ కుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ దండే విఠల్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర ప్రభుత్వానికి డీడీఎన్ అర్చకుల కృతజ్ఞతలు

ఆసిఫాబాద్‌అర్బన్: డీడీఎన్ పథకంలో పని చేస్తున్న అర్చకుల పెండింగ్ వేతనాలను విడుదల చేసినందుకు జిల్లా సంఘం తరపున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డీడీఎన్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధిహామీ అక్రమాలకు చెక్

- జన్‌మన్‌రేగా యాప్‌తో పారదర్శకత
- సెల్‌ఫోన్‌లోనే సమస్త సమాచారం
- మండలంలో 9,960 జాబ్ కార్డులు, 6,392 మంది కూలీలు



జన్‌మన్‌రేగా యాప్ ముఖ చిత్రం


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

వాంకిడి: గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. అర్హులైన పేదలకు జాబ్‌కార్డులు మంజూరు చేసి వివిధ రకాల పనులతో ఒక్కో జాబ్‌కార్డుపై 100 రోజులు పని కల్పిస్తున్నారు. ఈక్రమంలో కొన్ని చోట్ల అనేక అక్రమాలు వెలుగుచూసేవి. దీంతో ఉపాధిహామీలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్రం ఒక ప్రత్యేకమైన యాప్‌ను తీసుకొచ్చింది. గతంలో పనులకు వెళ్లిన కూలీల వివరాలు తెలుసుకోవాలంటే కార్యాలయాలకు వెళ్లి ఆరా తీయడం.. సిబ్బందిని అడిగి తెలుసుకోవడం జరిగేది. కానీ ప్రస్తుతం కేంద్రం తీసుకొచ్చిన ఓ ప్రత్యేకమైన యాప్‌తో అరచేతిలో ఉపాధిహామీ పనుల పూర్తి వివరాలను తెలుసుకునే అవకాశంతో పాటు పనుల్లో పారదర్శకత కలుగనుంది.

'జనమన్‌రేగా'తో పూర్తి సమాచారం..

మండలంలో మొత్తం 28 గ్రామ పంచాయతీలలో 9960 జాబ్‌కార్డు దారులు ఉండగా పని చేసే కూలీలు 6392 మంది ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రతీ ఏడాది మార్చి నెలలో ఉపాధి హామీ పనులు ప్రారంభమై జూన్ వరకు జోరుగా సాగుతాయి. అయితే ఉపాధి పనుల్లో జరుగుతున్న అవకతవకలు, కూలీల వేతనాల్లో అక్రమాలు అరికట్టేందుకు కేంద్రం ఒక సరికొత్త యాప్ 'జన్‌మన్‌నరేగా'ను తీసుకొచ్చింది. ఆండ్రాయిడ్ మొబైల్ యూజర్లు జన్‌మన్‌నరేగా యాప్‌ను ప్లే స్టోర్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. అనంతరం పేమెంట్స్ ఆప్షన్ ఎంచుకుని క్లిక్ చేస్తే పని చేసిన వివరాలు పూర్తిగా దర్శనమిస్తాయి. ఎక్కడ పని చేశారు.. పని దినాల సంఖ్య.. వేతనం ఎంత చెల్లించారు.. ఏ బ్యాంకులో డబ్బులు జమవుతున్నాయి.. లబ్ధిదారుడి ఖాతాకు ఆధార్ లింక్ ఉందా, లేదా.. అనే విషయాలను తెలుసుకోవచ్చు. జాబ్‌కార్డులోని కుటుంబ సభ్యుల వివరాలు సైతం ఉంటాయి. యాప్‌పై అవగాహన ఉంటే ఎవరి పేరుపై ఎలాంటి అవకతవకలు జరిగినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకునే వీలు కలుగుతుంది.

మండలంలోని ఉపాధి పనులు..

మండలంలో గతేడాది నిర్వహించిన వ్యవసాయ సంబంధ పనులకే ఈ ఏడాదిలో సైతం ప్రాధాన్యత కల్పించారు. పొలాలకు వెళ్లే దారులకు మట్టి రోడ్లు, చెరువుల్లో పూడిక తీత, కందకాల తవ్వకాలు, నీటి కుంటలు వంటి పనులకు ప్రాధాన్యత కల్పించారు. అలాగే స్వయం ఉపాధి పొందేలా కోళ్ల పెంపకాలు, మేకల పెంపకం, పండ్ల తోటలు, గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, భూ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అయితే 2024 –25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులు, పని దినాలు పెంచుతూ 2025 –26 ఏడాదికి ప్రణాళికను అధికారులు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంతో పని దినాలు, కులాల సంఖ్య ఈసారి పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఫిర్యాదు చేసే అవకాశం



ఉపాధిహామీ పథకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వం జన్‌మన్‌రేగా యాప్‌ను అమలు చేస్తుంది. పనులకు వెళ్లే జాబ్‌కార్డుదారులకు పని దినాలు, వేతనాల చెల్లింపుల విషయంలో ఎలాంటి అనుమానాలు వచ్చిన నేరుగా యాప్ నుంచే ఫిర్యాదు చేయవచ్చు. ఉపాధిహామీ కూలీలకు ఈ యాప్‌పై పని ప్రదేశాల్లో అవగాహన కల్పిస్తాం. కూలీల సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చు. దీని ద్వారా పనుల్లో పారదర్శకత పెరుగుతుంది. – శ్రావణ్ కుమార్, ఏపీవో

జంగుబాయి దీక్షతో సన్మార్గం!


హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న జంగుబాయి భక్తులు

- ఆదివాసీ గ్రామాల్లో ఆధ్యాత్మికత
- వీర్ధండిలో జోరుగా మాలధారణలు
- ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని గిరిజన గ్రామం వీర్ధండిలో పెద్దలతో పాటు యువకులు ఆధ్యాత్మిక మార్గంలో ముందుకెళ్తున్నారు. పుష్యమాసం పురస్కరించుకొని గ్రామంలోని దాదాపు 120 మందికి పైగా ఆదివాసీ మహిళలు, పురుషులు జంగుబాయి దీక్షలు స్వీకరించారు. వీరు గ్రామంలోని హనుమాన్ ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆలయం దీక్ష స్వాములతో కిటకిటలాడుతోంది.

సన్మార్గంలో..

ఆదివాసీలకు పుష్యమాసం పవిత్రమైనది. ఈ మాసంలో జంగుబాయిని దర్శించుకుంటే మేలు చేకూరుతుందని వారి నమ్మకం. జంగుబాయి దీక్షాపరులు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ అలవర్చుకుని సాధారణ ధోరణికి భిన్నంగా ప్రత్యేకత చాటుతున్నారు. దీక్ష తీసుకోవడంలో ఒకవైపు ఆధ్యాత్మికత, మరోవైపు ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయని భక్తులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరం చాలా మంది యువకులు జంగుబాయి దీక్షలు స్వీకరించారు. వీరంతా జంగుబాయి దీక్ష నియమాలు పాటిస్తూ పలువురికి ఆదర్శంగా ని లుస్తున్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు తెలియజేసేందుకు గ్రామస్తులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. రోజూ ప్రత్యేక భజనలు చేస్తూ దీక్ష తీసుకున్నంత కాలం కఠిన నియమాలతో గడుపుతున్నారు.

ఆదివాసీల్లో ఆధ్యాత్మికత..

ఆదివాసీలు జంగుబాయి దీక్షను స్వీకరించి నెల రోజుల పాటు కఠోర నియయాలు పాటిస్తున్నారు. శివుడు, హనుమాన్‌తో పాటు కులదేవత పెర్సాపేన్, ఇష్టదైవం జంగుబాయి దీక్షలు స్వీకరించడం ఇక్కడ ప్రత్యేకం. గ్రామంలో 420 కుటుంబాలు ఉండగా అందులో అత్యధికంగా 300 వరకు ఆదివాసీ గిరిజన కుటుంబాలున్నాయి. మాలధారణ అనంతరం గ్రామంలో ఆదివాసీలు మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. కుటుంబసభ్యులు సైతం నెల రోజులు పాదరక్షలు ధరించకుండా నియమనిష్టలతో దేవతను పూజిస్తారు.

చరిత్ర వివరిస్తున్నాం..



జంగుబాయి మాలధారణతో భక్తిభావం పెరుగుతుంది. హనుమాన్ ఆలయంలో ప్రతీరోజు భజన చేస్తున్నాం. నిత్యం దైవ దర్శనంతో మంచి అలవాట్లు అలవడుతాయి. గత ఎనిమిదేళ్లుగా జంగుబాయి దీక్ష స్వీకరిస్తున్నాను. గ్రామంలో అందరికీ జంగుబాయి చరిత్ర వివరిస్తున్నాం. – మడావి అరవింద్, దీక్ష ప్రచార కార్యకర్త

దీక్షతో ప్రశాంతత..



నేను నాలుగేళ్లుగా జంగుబాయి దీక్ష తీసుకుంటున్నాను. స్వాములందరితో కలిసి ఉండటం ఎంతో ప్రశాంతంగా అనిపిస్తుంది. ఏటా పుష్యమాసంలో నెల రోజుల పాటు మా గ్రామంలో మద్యం, మాంసానికి దూరంగా ఉంటాం. – మడావి రేణుక, వీర్ధండి

చెడు వ్యసనాలకు దూరం



జంగుబాయి దీక్షలు స్వీకరించి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటాం. రోజూ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తున్నాం. దీక్షతో క్రమశిక్షణ అలవడుతుంది. నేను రెండుసార్లు జంగుబాయి దీక్ష స్వీకరించాను. – అరవింద్, వీర్ధండి

కలెక్టర్ పల్లె నిద్ర





ఆసిఫాబాద్: వాంకిడి మండలం బంబార గిరిజన ఆశ్రమ వసతి గృహంలో మంగళవారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి నేలపై పడుకున్నారు. వసతి గృహం ఆవరణ, భోజనం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వార్డన్‌కు సూచించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగేశ్వర్‌రావుతో కలిసి ఎంపీపీ కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు స్నేహభావం, మానసికోల్లాసం, శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని చెప్పారు. డీఎస్వో మీనారెడ్డి, జిల్లా పరీక్షల నిర్వహణాధికారి ఉదయ్‌బాబు, ఎంఈవో సుభాష్, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, విండో చైర్మన్ అలీబిన్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కౌటాల: ఎవరిదైనా సెల్‌ఫోన్ ఎక్కడైనా పోయినా, దొంగతనానికి గురైనా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి తిరిగి ఫోన్ అప్పగించారు. గురుడుపేట గ్రామానికి చెందిన శివసాయి సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొని సీఈఐఆర్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించినట్లు ఆయన తెలిపారు

అక్రమ షెడ్లు వెంటనే తొలగించాలి


మట్టి తొలగిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కౌటాల: మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా వేసిన అక్రమషెడ్లను వెంటనే తొలగించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు సమీపంలో షెడ్లు వేసిన వారికి 24 గంటల్లోగా షెడ్లను తొలగించాలని నోటీసులు అందజేశారు. రహదారి సమీపంలో షాపుల ఎదుట షెడ్లు వేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని తెలిపారు. భవనాలు నిర్మించే వారు రోడ్డుకు ఎత్తుగా మట్టి వేస్తుండడంతో మట్టి రోడ్డుపైకి వస్తుందని, వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము లేస్తుందని పేర్కొన్నారు. షాపుల ఎదుట వేసిన మొరం, కంకరను తొలగించాలని తెలిపారు. అనంతరం రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని ట్రాక్టర్‌తో తొలగించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు ఉన్నారు.

గీత పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక


నియామకపత్రం అందుకుంటున్న సభ్యులు

రెబ్బెన: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం రెబ్బెన గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించగా ఎన్నికల్లో గీతా పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా తాళ్లపెల్లి కిష్టాగౌడ్, ఉపాధ్యక్షుడిగా గడ్డం రమేశ్‌గౌడ్, కార్యదర్శిగా మడ్డి కృష్ణగౌడ్, డైరెక్టర్లుగా మోడెం సుదర్శన్‌గౌడ్, పూదరి శంకర్‌లు ఎన్నికయ్యారు. గీతా పారిశ్రామిక సహకార సంఘ నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మురళీగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరంజీవిగౌడ్‌లు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు.

చింతలమానెపల్లి ఎంపీడీవోగా సుధాకర్ రెడ్డి


సుధాకర్ రెడ్డితో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి ఎంపీడీవోగా సుధాకర్ రెడ్డి మంగళవారం నియమితులయ్యారు. చింతలమానెపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా కోట ప్రసాద్ విధులు నిర్వహిస్తుండగా ఎంపీవోగా సుధాకర్ రెడ్డి విధుల్లో ఉన్నారు. కాగా ఎంపీడీవోగా సుధాకర్ రెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ కాగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

'సీపీఆర్ఎంఎస్ కోసం దరఖాస్తులు చేసుకోవాలి'

రెబ్బెన: సింగరేణిలో పనిచేసి పదవీ విరమణ పొంది ఇప్పటి వరకు సీపీఆర్ఎంఎస్ కోసం దరఖాస్తు చేసుకోని కార్మికులకు యాజమాన్యం మరో అవకాశాన్ని కల్పిస్తూ సీపీఆర్ఎంఎస్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తుందని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని బెల్లంపల్లి ఏరియాలోని మాజీ సింగరేణి ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగరేణి యాజమాన్యం మార్చి 31, 2025 వరకు సీపీఆర్ఎంఎస్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని సింగరేణి మాజీ ఉద్యోగి, లేదా అతని భార్య రూ.60వేల బ్యాంకు డీడీ కార్మికుడు పని చేసిన గని, డిపార్టుమెంట్‌లో సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్డు ద్వారా సుమారు రూ. 8లక్షల వరకు సింగరేణికి అనుబంధంగా ఉన్న 100 హాస్పిటల్స్‌లో వైద్య సౌకర్యం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

దహెగాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని కమ్మర్‌పల్లి, చౌక, ఏనగూడ గ్రామాల్లో పాఠశాలలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరుశాతం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలన్నారు. వంట గది, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.